

ఏటిగట్ల పటిష్టతకు చర్యలు

ప్రజాశక్తి-మామిడికుదురు

గోదావరి తీరం వెంబడి ఏటిగట్ల పటిష్టతకు చర్యలు చేపడతామని ఎంపీ గంటి హరీష్ తెలిపారు. మంగళవారం వైనతేయ గోదావరి నది పరివాహక ప్రాంతం పాశర్లపూడి నుంచి ఆదుర్రు వరకు గోదావరిలో పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణతో కలిసి ఎంపీ బోటులో ప్రయాణించారు. బోటు ప్రయాణం ద్వారా నదీ కోతను పరిశీలించి కోత తీవ్రతను స్వయంగా చూశారు. అనంతరం ఏటిగట్టు పై రహదారి దుస్థితి పై రైతులు, స్థానికులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైతులను, స్థానికులను ఆదుకోవడం కోసం ఏటిగట్ల పటిష్టతకు, రోడ్డు ఏర్పాటు కు చర్యలు తీసుకునేలా ఎన్‌డిఎ ప్రభుత్వం కృషి చేసే విధంగా ప్రయత్నం చేస్తానని హరీష్ పేర్కొన్నారు. అనంతరం ఆదుర్రులో ఉన్న బౌద్ధ స్తూపాన్ని సందర్శించారు.

రైతులపై వరి కోతల భారం

- చైన్ ట్రాక్ యంత్రాలకు భారీ డిమాండ్
- అమాంతం పెరిగిన యంత్రాల అద్దెలు
- గంటకు రూ.3500 వరకు ఖర్చు
- అదనపు భారంతో రైతుల అవస్థ


వరికోతలో వినియోగిస్తున్న యంత్రం

ప్రజాశక్తి - రాజోలు

అన్నదాతలకు మరో కష్టం వచ్చిపడింది. ప్రకృతి విపత్తులు ఈ సారి వరి రైతులను బాగా దెబ్బతీశాయి. చేతికి వచ్చిన పంట ఇంటికి వచ్చే పరిస్థితి లేకుండా పోతున్నది. వరి కోతల విషయంలోనూ ఈ సారి ఎప్పుడూ లేనంత కష్టం వచ్చింది. వరద పొలాల్లో చేరడం, తేమ ఎంతకీ ఆరకపోవడం... వడ్లు అలాగే ఉండి మొలకెత్తే పరిస్థితి ఉన్నది. ప్రతిసారి టైర్ల మెషిన్లతో కోతలు పూర్తయ్యేవి. ఎక్కడో బాగా తేమ ఉండే ప్రాంతాల్లోనే వరి కోతలకు చైన్ ట్రాక్ మెషిన్లు ఉపయోగించే వారు. వరదలు వానలతో ఈ సారి పంట పొలాల్లో నీరు అలాగే ఉంటున్నది. వారంలోపు కచ్చితంగా వరి కోతలు పూర్తి చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. వరి విస్తీర్ణానికి అవసరమైన చైన్ ట్రాక్ మెషిన్లు లేకపోవడంతో రైతులు కోతలకు ఇబ్బంది కలుగుతున్నది. ప్రతి ఊర్లోనూ ఇప్పుడు వరికోత మెషిన్లకు బాగా డిమాండ్ ఉన్నది. చైన్ ట్రాక్ మెషిన్ల యజమానుల దగ్గరికి రైతులు వెళ్లి బతిమాలుతున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వడ్లు మొలకలు వచ్చే పరిస్థితి ఉండటంతో ట్రాక్ మెషిన్లకు డిమాండ్ పెరిగింది. ఇదే ఇప్పుడు రైతులకు మరింత భారంగా మారింది. వరి కోతల ఖర్చులు గతంలో రూ.20 వేలు ఉంటే ఇప్పుడు రూ.40 వేలకు పెరిగింది. పెట్టుబడి మినహా మిగిలేదే కొంత అంటే ఇప్పుడు వరి కోతలకు పెరిగిన ఖర్చులతో అన్నదాతలకు నష్టాలే మిగులుతున్నాయి. అక్టోబరు, నవంబర్ లో తుపాను ల వల్ల లో కురిసిన వర్షాలు, వరదలకు పంటలు నష్టపోవడమేకాక చాలాచోట్ల వరి పంట నేలకొరిగింది. కింద పడిన వరిని కోత కోయడానికి సమయం ఎక్కువ పడుతుంది. ఎకరాకు కనీసం గంటన్నర కన్నా ఎక్కువ సమయం పడుతుంది. ఈ లెక్కన ఎకరాకు రూ.5,000 నుంచి రూ.5,500 వరకు ఖర్చువుతోందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం వరసగా డీజిల్ రేట్లు పెంచడంతో యంత్రాల అద్దెల భారంతో రైతులపై పడుతోందని ప్రజా సంఘాలు ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన చైన్ ట్రాక్ యంత్రాల అద్దె..

ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా చైన్ ట్రాక్ మెషిన్లకు డిమాండ్ వచ్చింది. ఇదే అదునుగా వాటి యజమానులు వరి కోతల చార్జీలను పెంచారు. గతంలో గంటకు ధర రూ.2,200 నుంచి రూ.2,500 ఉండగా, ఇప్పుడు ఏకంగా రూ.3,500 నుంచి రూ.4,500 వరకు పెంచేశారు. నేలవాలిన ఎకరం వరి కోతకు రూ.7 వేల నుంచి రూ.8 వేలు అవుతోంది. చైన్ ట్రాక్ మిషన్ల కొరతతో ఈ సారి వరి కోతలు నెల తరబడి కొనసాగే పరిస్థితి ఉన్నది. కొనుగోలు కేంద్రాలకు వడ్లు ఆలస్యంగా వస్తున్నాయి. కోతల సమయంలో వచ్చిన వానలు వడ్లను పొలాల్లో నూకలు ఎక్కువ అయ్యే పరిస్థితి ఉన్నది. గిట్టుబాటు ధర వస్తుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా మమ్ముడివరం మండలంలో టైర్ మెషిన్ గంటకు రూ.1,700 తీసుకుంటే, చైన్ మెషిన్‌కు రూ.3,500 తీసుకుంటున్నారు. ఎకరం పొలం కోసేందుకు రైతులు రూ.7 వేలకు పైగా ఖర్చువుతుందని వాపోతున్నారు.

-పూర్తిగా వరి కోత యంత్రాలపైనే...!

ఈశాన్య రుతుపవనాల ప్రభావం ఖరీఫ్ పై చూపించక ముందే పండిన పంటను ఒబ్బిడి చేసుకోవాలన్న ఆతృతతో పలువురు రైతులు వరికోత యంత్రాల సాయంతో వరికోతలు కోస్తున్నారు. సాధారణంగా రబీలోనే ఎక్కువగా వరికోతలు యంత్రాలపై చేపట్ట వారు. ఇటీవల ఖరీఫ్ లో కూడా యంత్రాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. వరికోత యంత్రానికి గంటకు రూ.2,800 నుంచి రూ.3 వేల వరకూ చెల్లిస్తున్నారు. దీంతో ఇప్పటికే వరికోత యంత్రాలు పంట పొలాలకు చేరుకోగా, డిమాండ్ పెరగడంతో మరిన్ని వస్తున్నాయి. జిల్లాలో 1.61 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి నాట్లు వేశారు. 80 శాతం మేర స్వర్ణ రకాన్ని సాగు చేయగా మిగిలిన 20 శాతం విస్తీర్ణంలో ఎంటియూ 1,318, ఎంటియు 3626 (బొండాలు)తదితర రకాల వంగడాలను సాగు చేశారు.

వరి సాగు గగనంగా మారింది

ప్రస్తుత పరిస్థితుల్లో వరిపంట సాగు గగనంగా మారింది. ప్రతి ఏడాది క్రిమిసంహారక మందులు, కాంప్లెక్స్ ఎరువుల ధరలు, కూలీల ధరలు, ట్రాక్టర్ల అద్దెలు ధరలు పెరుగుతున్నాయి. గతంలో ఎకరాకు రూ.15 వేలు ఖర్చు చేసేవాళ్లం. ప్రస్తుతం రూ.20 వేలకు పైగా ఖర్చువుతోంది. నూర్పుల ధరలు కూడా పెరగడంతో రైతులకు ఏమీ మిగలడం లేదు.

-బుంగ సత్యనారాయణ, కౌలు రైతు ,బి.సావరం

కుటుంబ కలహాలే కారణమా..?

- అదృశ్యమైన తండ్రి, ఇద్దరు పిల్లలు
- తండ్రి, కుమారుని మృతదేహాలు లభ్యం
- కుమార్తె కోసం గాలింపు

ప్రజాశక్తి - అమలాపురం

మలికిపురం మండలం దిండి వారధి వద్ద సోమవారం ఒక తండ్రి, తన ఇద్దరు పిల్లలతో అదృశ్యమయ్యాడు. ఈ ఘటనలో శిరిగినీడి దుర్గాప్రసాద్ (43), అతని కుమారుడు మోహిత్ (14) మృతదేహాలు మంగళవారం లభ్యమయ్యాయి. పోలీసులు వారధికి సమీపంలోనే రెండు మృతదేహాలను వెలికి తీశారు. కుమార్తె జాహ్నవి (9) ఆచూకీ కోసం గాలిస్తున్నారు. కుటుంబ కలహాలే ఈ ఆత్మహత్యకు కారణంగా చెబుతున్నారు. రెండు మృతదేహాలను చూసి వారి బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. మలికిపురం మండలం లక్కవరం గ్రామంలోని ఓ తండ్రి తన ఇద్దరు పిల్లలతో అదృశ్యమైన ఘటన వెలుగు చూసింది. లక్కవరం గ్రామానికి చెందిన శిరిగినీడి దుర్గాప్రసాద్ తన ద్విచక్రవాహనాన్ని దిండి-చించినాడ వశిష్ట వారధిపై నిలిపి తన సెల్‌ఫోన్, చెప్పులు, కొన్ని ఫోన్ నంబర్లతో రాసి ఉన్న కాగితాన్ని అక్కడే వదిలి ఉంచడాన్ని స్థానికులు గుర్తించారు. దుర్గాప్రసాద్ చెప్పులతో పాటు తన కుమారుడు మోహిత్, కుమార్తె జాహ్నవిలకు చెందిన చెప్పులు కూడా అక్కడే ఉండడంతో ఆ ఇద్దరు పిల్లలతో కలిసి నదిలో దూకి ఉండొచ్చని భావించారు. కాగితంలో ఉన్న ఫోన్ నెంబర్లకు ఫోను చేసి చెప్పడంతో కుటుంబ సభ్యులు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అయితే వారు వారధిపై నుంచి నదిలోకి దూకినట్లు ఎవరూ చూడలేదు. దీంతో ఏం జరిగిందో తెలియని పరిస్థితుల్లో దుర్గాప్రసాద్ బంధువు రేకపల్లి రమేశ్ బాబు పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి పోలీసుస్టేషన్లో తన బావ, వారి పిల్లలు కనిపించడం లేదని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దుర్గాప్రసాద్ తన భార్య నాగవేణి, పిల్లలతో కలిసి వారం రోజులుగా విశ్వేశ్వరాయపురంలోని మామ పెద్దకాపు ఇంట్లో ఉంటున్నట్లు చెబుతున్నారు. సోమవారం సాయంత్రం పాఠశాల నుంచి వచ్చిన పిల్లల ఆధార్ కార్డులు అప్డేట్ చేయించాలని చెప్పి ఇంట్లోంచి వారిని తీసుకుని బయటికి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు ఈ సందర్భ:గా తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ పి.సురేశ్ దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులతో మాట్లాడినట్లు చెప్పారు.

పారదర్శకంగా ధాన్యం సేకరణ


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ,చైర్మన్ తదితరులు

ప్రజాశక్తి - అంబాజీపేట

రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ పారదర్శకంగా నిర్వహిస్తామని, ప్రతీ ఒక్క రైతు పంటను ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. చిరతపూడి సొసైటీ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ దళారులకు ఎలాంటి అవకాశం ఇవ్వబోమని, రైతు ప్రయోజనాలే లక్ష్యమన్నారు. సర్పంచ్ కోట బేబీరాణి మాట్లాడుతూ రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తెచ్చి కొనుగోలు కేంద్రాలలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సొసైటీ ఛైర్మన్ రంపం సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు బుధవారం అన్నదాతా సుఖీభవ పథకం కింద రైతులకు బ్యాంకుల ద్వారా డబ్బులు జమ చేయడం రైతుల జీవితాలలో ఆనందం నింపుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి నేతల నాగరాజు, పర్సన్‌లు కొత్తలంక సుబ్బారావు, బండారు కామరాజు, టిడిపి కో-కన్వీనర్ డివివి. సత్యనారాయణ, అయ్యగారి సూరిబాబు, సరేళ్ళ వెంకటేశ్వర్లు, ప్రజా ప్రతినిధులు కూటమి నాయకులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, సిఇఒ పిఎస్ఎన్.మూర్తి, పిపిసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




అవార్డ్ అందుకుంటున్న డాక్టర్ శ్రీరామకృష్ణ

డాక్టర్ శ్రీరామకృష్ణకు అవార్డు

ప్రజాశక్తి - ఆలమూరు

సందిపూడికి చెందిన డాక్టర్ సూరపురెడ్డి శ్రీరామకృష్ణ గుంటూరు కోనేరు లక్ష్మయ్య డీమ్డ్ యూనివర్సిటీలో 2025 ఏడాదికి ఎక్సలెన్స్ ఇన్ రీసెర్చ్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ కోనేరు లక్ష్మయ్య యూనివర్సిటీలో పూర్వ విద్యార్థినన్నారు. ప్రస్తుతం హైదరాబాదులో డైసెల్ కైరెల్ టెక్నాలజీస్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ లో డైరెక్టర్ గా పని చేస్తున్నట్లు తెలిపారు. కెఎల్ యూనివర్సిటీలో ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ అండ్ అనలిటికల్, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ నందు పరిశోధన చేసినట్లు తెలిపారు. అందులో ఉన్నత ప్రతిభ కనబరిచినందుకు ఈ అవార్డు దక్కినట్లు తెలిపారు. నవంబర్‌బరు 15న యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డ ప్రదానంచేశారన్నారు. అవార్డు రావడానికి సహకరించిన యూనివర్సిటీ సభ్యులకు, మెంటార్స్, సాహచరులకు కృతజ్ఞతలు తెలియజేశారు. డాక్టర్ శ్రీరామకృష్ణతో చదువుకున్న పూర్వపు విద్యార్థులు యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు స్థానిక కొత్తూర్ ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైవివి.రమణ, పినపల్ల సర్పంచ్ సంగీత సుభాష్ తదితరులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

కార్టూ'నిజం'



సోలార్ విద్యుత్‌ను సద్వినియోగంచేసుకోవాలి


పట్టణంలో సోలార్ యూనిట్ ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

ప్రజాశక్తి - రామచంద్రపురం

విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోనేందుకు ప్రతి ఒక్కరూ సోలార్ యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. స్థానిక బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన గోదావరి సోలార్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సోలార్‌విద్యుత్ వినియోగించుకుని, డబ్బులు ఆదా చేసుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు సంయుక్తంగా సోలార్ విద్యుత్తు వినియో గించు కోవడానికి పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా సబ్సిడీ ఇస్తుందని అన్నారు. సోలార్ ద్వారా వన్ కెవికి 120 యూనిట్లు విద్యుత్ జనరేట్ అవుతుందని దీనివల్ల ప్రతి ఏటా రూ.8వేల ఆదాఅవుతుం దన్నారు. దీనికి ప్రభుత్వం రూ.35 వేల సబ్సిడీ ఇస్తుందన్నారు. అలాగే 2 కెవి 250 నుంచి 300 యూనిట్ల వరకు విద్యుత్ జనరేట్ అవుతుందన్నారు. దీనివల్ల రూ.20 వేలు ఆదా అవుతుందన్నారు. దీని వల్ల సబ్సిడీ రూ.60 వేలు ఇస్తుందన్నారు. 3కేవీకి రూ.75 వేలు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తుందని అన్నారు. ఎస్‌సిలకు పూర్తిగా ఉచితంగా సోలార్ విద్యుత్ ఏర్పాటు చేస్తుందని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోదావరి సోలార్ యూనిట్ అధినేతలు సురేష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కార్డ్ ఉన్నవారికి ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

జాబ్‌కార్డు ఉన్న ఉపాధి హామీ కూలీలు ఇకెవైసి తప్పనిసరిగా చేయించు కోవాలని గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఒ రంజిత్ సింగ్‌లు అన్నారు. మంగళవారం కపిలేశ్వరపురం గ్రామ పంచాయతీ కార్యా లయాల వద్ద ఎన్ఆర్ఇ జిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధి హామీ గ్రామసభలో వారు పాల్గొని మాట్లా డారు. ఈ సందర్భంగా ఎపిఒ రంజిత్ సింగ్ మాట్లాడుతూ 2026 -2027 ఆర్థిక సంవ త్సరం సంబంధించి గ్రామాల్లో గుర్తించిన ఉపాధి హామీ పనుల నివేదికను గ్రామ సభలో చదివి వినిపించారు. ఉపాధి హామీ చట్టంలో జాబ్ కార్డు కలిగిన ఉపాధి కూలీలు ప్రతి ఒక్కరూ ఫీల్డ్ అసిస్టెంట్ లాగిన్ లో తప్పనిసరిగా ఇకెవైసి చేయించు కోవాలని అన్నారు. గ్రామంలో 47 పనులను గుర్తించి నట్లు తెలిపారు. ఈ పనుల వివరాల నివేది కను ఉన్నతాధికారులకు తెలియ జేయునట్లు తెలిపారు. ఆయా గ్రామ సభలో ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు, కార్యదర్శి శివచక్రవర్తి, విఆర్ఒ సత్యనారాయణ, జెఇ రవి కుమార్, సచివాలయ ఉద్యోగులు, మేట్లు, ఉపాధి కూలీలు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు కృషి



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ డి.కృష్ణ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపిడిఒ డి.కృష్ణ కోరారు. గ్రామాలు పచ్చదనం, పరిశుభ్రతతో నిండి ఉండి కళకళలాడుతూ ఉండాలని ఆయన అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం డిప్యూటీ ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ అధ్యక్షతన గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రతపై సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు పవర్ ప్రజెంటేషన్ ద్వారా ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ డి.కృష్ణ మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రత వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, సర్పంచ్‌లు కుంచే బుల్లియ్య, బద్రి బాబ్జి, పెయ్యల రాజ్ కుమార్, యర్రంశెట్టి రామచంద్రరావు, ఇసుకపట్ల జయమణి, జోగి రాజేశ్వరి, జొన్నాడ శ్రీ దుర్గ, వాకపల్లి ఈశ్వరి, కుంచే చిట్టికుమారి, కార్యాలయ ఎఒ, భూపతిరాజు తులసికృష్ణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అండర్-14 విభాగంలో మునిపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో పాఠశాలకు చెందిన సిహెచ్.హెప్సిబా,ఎం.కావ్య శ్రీ, ఎం.పావని పాల్గొని రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 22 నుంచి 24 వరకు నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను మంగళవారం ఆ పాఠశాలలో సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, ఎస్ఎంసి ఛైర్మన్ యాళ్ళ కిరణ్, హెచ్‌ఎం ఎం.వెంకట సుబ్బారావు, పీడీ నూకల సీతాపతి, ఉపాధ్యాయులు అభినందించారు.

డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన




అంగరలో అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

అంగర శ్రీసిద్ధార్థ జూనియర్ కళాశాలలో మంగళవారంనషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ దుష్ప్రభావాలుపై విద్యార్థులకు అవగాహనా సదస్సును నిర్వహించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని, దేశంలో డ్రగ్స్ ప్రభావాల నివారణ కోసం నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో విరివిగా పాల్గొంటామని, ప్రజలను మేల్కొలిపేందుకు తమ వంతు కషి చేస్తామంటూ విద్యార్థులుచే ప్రతిజ్ఞ చేశారు. కళాశాల డైరెక్టర్ వాకా పరమేశ్వర అధ్యక్షన, అంగర ఎస్ఐ జి.హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో పలు సామాజిక అంశాలను వివరించారు. మండపేట రూరల్ సిఐ దొరరాజు మాట్లాడుతూ దేశం మొత్తం మత్తు పదార్థాల నుంచి విముక్తి కావడమనే లక్ష్యంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను చేపట్టామన్నారు. డ్రగ్స్ సామాజిక దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడం, ఇప్పటికే డ్రగ్స్‌కు అలవాటుపడినవారికి కౌన్సిలింగ్ ఇవ్వడమూ, డ్రగ్స్ ట్రాఫికింగ్ స్మగ్లింగ్‌లపై కఠిన చర్యలు తీసుకోవడమనే లక్ష్యంతో క్షేత్ర స్థాయిలో కృషి చేస్తున్నామన్నారు. ఎస్ఐ జి.హరీష్‌కుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత భారతదేశం సాధనకై విద్యార్థులు ముందు పథాన నడవాలన్నారు. శ్రీసిద్ధార్థ కళాశాల డైరెక్టర్ వాకా పరమేశ్వర మాట్లాడుతూ చదువు సక్రమంగా సాగాలన్నా, మంచి ఉద్యోగ, వ్యాపార అవకాశాలను అందిపుచ్చు కోవాలన్నా నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. డ్రగ్స్ వ్యక్తినే కాకుండా మొత్తం సమాజాన్ని దెబ్బతీస్తుందని హెచ్చరించారు. అనంతరం అంగర గ్రామ వీధుల్లో అవగాహనా ర్యాలీ నిర్వహించి గాంధీ సెంటర్‌లో మానవహారం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి.రమణ, వి పరమేశ్వర, అధ్యాపకులు ఎస్ఎస్‌వి. శ్రీనివాస్, కోశెట్టి పరదేశి, మేడపాటి తమ్మిరాజు, అనుసూరి శ్రీనివాస్, పెద్దింశెట్టి లెలిన్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుమారుని పార్థివ దేహం దానం

అందజేసిన వృద్ధ తల్లి


అచ్యుత్ రామ్ చౌదరి(ఫైల్)

ప్రజాశక్తి - అయినవిల్లి, అమలాపురం

తన కుమారుడి పార్థివ దేహాన్ని ఆ తల్లి కిమ్స్ వైద్య కళాశాలకు అందించింది. వివరాలు ఇవి.. అయినవిల్లి లంకకు చెందిన 80 సంవత్సరాల వయస్సు గల చిట్టూరి సీతా రత్నం తన మరణానంతరం తన పార్థివ శరీరాన్ని కిమ్స్ వైద్య కళాశాలకు దానం చేయమని తన కుమారుని కోరింది. అయితే ఆమె కుమారుడు చిట్టూరి అచ్యుత రామ్ చౌదరి(45) అనారోగ్య కారణా లతో ఈ నెల 4న మరణించారు. ఆ తల్లి తన కుమారుని పార్థివ దేహాన్ని కిమ్స్ వైద్య కళాశాలకు దానం చేశారు. ఆమె మాట్లాడుతూ 'జీవితకాలంలో వైద్యులు నా కొడుకుకు సేవ చేశారు. మరణానంతరం అతను వైద్య విద్యకు సేవ చేయాలి' అది అతని ఆత్మకు శాంతిని అందిస్తుందని ఆమె చెప్పిన మాటలు వినేవారిని కదిలించాయి. కిమ్స్ అనాటమీ విభాగాధిపతి డాక్టర్ బి.నారాయణరావు మాట్లాడుతూ మరణం తర్వాత కూడా సమాజానికి ఉపయోగపడే పార్థివ దేహాన్ని దానం ద్వారా కుమారుడు తల్లి ఒక శాశ్వత సేవకు రూపం ఇచ్చారన్నారు. కిమ్స్ మెడికల్ కాలేజ్ డీన్ మాట్లాడుతూ ఆ గొప్ప తల్లి చూపిన అపా రమైన మాన వతా భావాన్ని భావోద్వేగంతో ప్రశం సించారు. 'ఇలాంటి తల్లులు సమాజానికి మార్గదర్శకులన్నారు. ఆమె చేసిన శరీరదానం భవిష్యత్తు తరాల వైద్యులకు వెలకట్టలేని కానుక' అని అన్నారు. ఈ నిర్ణయం మరెందరికో ప్రేరణగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆమె సేవలను గుర్తిస్తూ ఆమె బంధువులు కోడూరి లక్ష్మణరావు, చిట్టూరి వీర వెంకట సత్యనారాయణ మూర్తి (చౌదరి) లకు ప్రశంసాపత్రం అందజేశారు. కిమ్స్ ఛైర్మన్ కెవివి.సత్యనారాయణ రాజు, ఎండి రవికిరణ్ వర్మ మాట్లాడుతూ మానవతా మాధుర్యంతో మెరిసే ఆ తల్లి చేసిన త్యాగం, సమాజానికి చూపిన ప్రేమ, భవిష్యత్తు వైద్యుల శిక్షణ కోసం ఆమె చేసిన ఈ అమూల్యమైన సహకారం అనిర్వచనీయమని, మహత్తరమైనదని ప్రశంసించారు.

ఘనంగా కాటన్ విగ్రహం ఆవిష్కరణ


సందిపూడిలో కాటన్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రామ్మూర్తి

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని సందిపూడిలో మంగళవారం సర్ ఆర్థర్ కాటన్ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. దొడ్డ సత్తిపండు కుటుంబ సభ్యుల తల్లిదండ్రులు దొడ్డ వెంకయ్య, భూలోకం దంపతుల జ్ఞాపకార్థం రూ.ఐదు లక్షలతో సర్ ఆర్థర్ కాటన్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గ్రామాన్ని దత్తత తీసుకున్న అడపా భాస్కర రామ్మూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి కాటన్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ ఆర్థర్ కాటన్ సేవలను కొనియాడారు. అలాగే విగ్రహం సమకూర్చిన దాతలను గ్రామ పెద్దలు, నాయకులు, యువకులు, తదితరులు అభినందించారు.


సాయం అందిస్తున్న పప్పుల లక్ష్మీ రమేష్

మొంథా తుపాను బాధితులకు సాయం

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

మోరి గ్రామంలో మొంథా తుపాను బాధితులకు టిడిపి నేత, మాజీ ఎంపిఇప పప్పుల లక్ష్మీ రమేష్ సాయం అందించారు. మంగళవారం మోరిలో తన స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 320 మందికి 10 కేజీల బియ్యం, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళా దుంపలు తన సొంత నిధులతో లక్ష్మీ రమేష్ అందించారు. ఈ కార్యక్రమంలో వుయ్యూరి వారి మెరక పిఎసిఎస్ సంఘం అధ్యక్షులు వీరా రామారావు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి తాడి సత్యనారాయణ, మోరి చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు చింత వీరభద్రరావు, మోరి టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు పంగం సుధాకర్, బుసిం చినబాబురావు, కొండ సత్యనారాయణ, ఉండ్రాజవరపు బాబురావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆలమూరు డిటిగా మంగారావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఆలమూరు

ఆలమూరు మండల రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా టి.మంగారావు ఫుల్ అడిషనల్ ఛార్జితో బాధ్యతలు మంగళవారం స్వీకరించారు. ఈయన ప్రస్తుతం ఇదే కార్యాలయంలో సర్వే డిటిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు డీటీగా వ్యవహరించిన సుబ్బ రాజు కలెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.


ఛైర్మన్‌కు జనరేటర్‌ను అందజేస్తున్న దాతలు

జనార్ధన స్వామి ఆలయానికి జనరేటర్ అందజేత

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత జనార్ధన స్వామి ఆలయానికి రూ.15వేల విలువైన 1 కెవిఎ జనరేటర్‌ను స్థానికులు కామవరపు సత్య సుబ్రమణ్య శర్మ , కాశీ అన్నపూర్ణ దంపతులు కొనుగోలు చేశారు. దీంతో మంగళవారం ఆల యానికి విచ్చేసి వారు జనరేటర్‌ను ఛైర్మన్ భైరిశెట్టి రాంబాబు, అర్చకులు ఖండ వల్లి ప్రభాకరా చార్యులు, అంగర భగవానా చార్యులకు అందజేశారు.

నేరాలు ఘోరాలు

మున్సిపల్ చైర్‌పర్సన్ మొబైల్ హ్యాక్ రూ.3.40 లక్షల చోరీ

ప్రజాశక్తి - తుని

తుని మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భవనసుందరి మొబైల్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి రూ.3.40 లక్షలను చోరీ చేశారు. ఈ మేరకు ఆమె మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన వాట్సాప్‌ని హ్యాక్ చేసి తన యుపిఐ పని చేయట్లేదని డబ్బులు అవసరమని తాను చాటింగ్ చేసినట్లుగా సైబర్ నేరగాళ్లు చాటింగ్ చేశారని అన్నారు. దీంతో తన బంధువులు, స్నేహితులు డబ్బులు వేయగా రెండు గంటల వ్యవధిలో రూ.3.40 లక్షలను స్వాహా చేశారని తెలిపారు.

ప్రాణం తీసిన కళాశాల బస్సు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని మామిడాడ వద్ద బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ప్రయివేటు కళాశాల బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం..పశ్చిమ గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన సాయి (27) మామిడాడ గ్రామ శివారున ఇటుక బట్టీ నిర్వహిస్తున్నాడు. సరుకులు తెచ్చుకునేందుకు మంగళవారం ఉదయాన్నే బైక్‌పై బయలు దేరాడు. కొంచెం దూరం వెళ్ళేసరికి ప్రయివేటు కళాశాలకు చెదిన బస్సు అతివేగంతో ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అతివేగం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెప్పారు. మృతునికి రెండేళ్ల క్రితం వివాహం కాగా, మూడు రోజుల క్రితం పాప జన్మించింది. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. హెచ్‌సి మాణిక్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గండేపల్లి మండలం జెడ్.రాగంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు.

మోసం కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - రౌతులపూడి

ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. రౌతులపూడికి చెందిన గెడ్డం లోవప్రసాద్ అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకొని అనంతరం పెళ్లికి నిరాకరించాడు. ఈ నెల 7వ తేదీన సంబంధిత యువతి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో లోవప్రసాదును అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు బాలిక

ప్రజాశక్తి - సీతానగరం

అదృశ్యమైన వంగళపూడి గ్రామానికి చెందిన బాలికను పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. తన కుమార్తె అదృశ్యమైందని బాలిక తండ్రి యాళ్ల వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాలిక నాగంపల్లిలో ఉన్నట్టు గుర్తించారు. చదువులో వెనుకబడటంతో తల్లిదండ్రులు మందలించారని, దీంతో బాలిక చుట్టాల ఇంటికి వెళ్లినట్లు దర్యాప్తులో తేలిందని ఎస్‌ఐ రామ్‌కుమార్ తెలిపారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు.

పోక్సో కేసులో నిందితునికి రిమాండ్

ప్రజాశక్తి - సీతానగరం

రఘుదేవపురంలో ఇటీవల నమోదైన పోక్సో కేసులో నిందితుడు గడుసుల నాగవెంకటేష్‌ను నార్త్ జోన్ డిఎస్‌పి శ్రీకాంత్ అరెస్ట్ చేశారు. నిందితుడిని మంగళవారం కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజులు రిమాండ్ విధించిందని సీతానగరం ఎస్‌ఐ రామ్‌కుమార్ తెలిపారు. బాలికలు, మహిళలతో గౌరవప్రదంగా వ్యవహరించాలని యువకులకు సూచించారు. లేకుంటే కేసుల్లో చిక్కుకుంటారని హెచ్చరించారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - కొత్తపేట

అమలాపురం వెళ్లే ప్రధాన పంట కాలువలో కొత్తపేట పరిధిలోని గోగివారిపేట సమీపంలో మంగళవారం గుర్తు తెలియని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కొత్తపేట ఎస్‌ఐ జి.సురేంద్ర మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు. సుమారు 40- 45 సంవత్సరాలు వయసు కలిగిన పురుషుడి మృతదేహం కొట్టుకు వచ్చినట్లు చెప్పారు. అతని కుడి చేతిపై అనంత పవన్‌కుమార్ అని పచ్చబొట్టు ఉందన్నారు. చనిపోయిన వ్యక్తి శరీరంపై నీలం రంగుపై బిస్కెట్ కలర్ గళ్ల చొక్కా, బిస్కెట్ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. ప్రస్తుతం మృతదేహం కొత్తపేట ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉందన్నారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిసినవారు కొత్తపేట ఎస్‌ఐ సెల్ నెంబర్ 9440904842, రావులపాలెం రూరల్ సిఐ నెంబర్ 9440796527కు సమాచారం ఇవ్వాలని కోరారు.

గ్యాస్ డెలివరీ బాయ్‌కి తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట - పిఠాపురం రోడ్డులోని బ్రౌన్ పేట సెంటర్ వద్ద మంగళవారం రెండు లారీల మధ్య గ్యాస్ సిలిండర్లతో వెళుతున్న బైక్ చిక్కుకుంది. ఈ ప్రమాదంలో గ్యాస్ డెలివరీ బాయ్‌కి త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ఎదురెదురుగా వస్తున్న లారీలు బైకును ఢీకొట్టడంతో గ్యాస్ సిలిండర్‌లు సరఫరా చేసే గంటా శివ పల్టీ కొట్టారు. ప్రమాదంలో బైక్ ధ్వంసం కాగా, శివ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో గ్యాస్ సిలిండర్లు కిందకు పడిపోవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

24న కలెక్టరేట్ వద్ద పోరాట దీక్ష

ప్రజాశక్తి -మామిడికుదురు

సమస్యల పరిష్కారం కోసం అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ఈ నెల 24న పోరాట దీక్ష చేస్తున్నామని మండల సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోరింగ్ ఉద్యోగుల సంఘం మంగళవారం తెలిపింది. ఈనెల 24న కాజువల్ లీవ్ మంజూరు చేయాలని కోరుతూ ఎంఇఒలు లక్ష్మీనారాయణ, ఎం.వెంకన్న బాబు ల కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. తమ తమ నాయపరమైన సమస్యల పరిష్కారం కోసం పోరాట దీక్ష చేపడుతున్నామన్నారు.



చెముడులంక వద్ద ఆర్‌డిఒకు పరిస్థితిని వివరిస్తున్న స్థానికులు

పారదర్శకంగా సర్వీసు రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - ఆలమూరు

మడికి కూరగాయ మార్కెట్ నుంచి చొప్పెల్ల రైస్‌మిల్ వరకు 216 ఎ జాతీయ రహదారికి సర్వీసు రోడ్డు నిర్మాణాలు పారదర్శకంగా చేపట్టాలని ఆర్‌డిఒ పి.శ్రీకర్ హైవే సిబ్బందికి ఆదేశించారు. ఈ మేరకు మండలంలోని మడికి చెముడు లంక వద్ద స్థితి గతులను హైవే స్థానిక మండల అధికారులతో కలిసి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమస్య ఉన్న చోట ఉన్నత అధికారులు, స్థానికలతో చర్చలు జరిపి చర్యలు తీసుకోవాలని యంత్రాంగానికి ఆర్‌డిఒ సూచించారు.

ఆర్‌డిఒ వద్ద బాధితుల ఆవేదన

మొత్తం మూడు కి.మీ్లీ పొడవునా చెముడులంక గ్రామ పరిధిలోనే అత్యధిక షాపులు, ఇల్లు ఉన్నాయని తీవ్రంగా నష్టపోతున్నామని బాధితులు ఆర్‌డిఒ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. అయితే పూర్తిస్థాయిలో భూ సేకరణ చేపట్టినట్లు నేషనల్ హైవే అధికారులు చెప్తుంటే కొందరు గృహ నిర్మాణదారులు తమకు అంత వెడల్పుకు సంబంధించి డబ్బులు ఇవ్వలేదని స్థానికులు వివరించారు. చెముడులంక పాత గ్రామ కంఠం పరిధిలో జాతీయ రహదారికి ఆరున్నర మీటర్లు మాత్రమే స్థలం ఉందని మిగిలిన ఐదున్నర మీటర్లకు నష్టపరిహారం ఇవ్వాలని వారు పట్టుబడుతున్నారు. దీనిపై స్పందించిన ఆయన రెవెన్యూ హైవే రికార్డులను పరిశీలించిన అనంతరం చర్యలు తీసుకుంటామనిహామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ కెజె.ప్రకాష్ బాబు, ఎంపిడిఒ ఎ.రాజు, ఆర్‌ఐ రామాయమ్మ, హైవే అధికారులు, గుత్తేదారులు, వీఆర్వోలు, సర్వేలు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

ప్రజాశక్తి - పి.గన్నవరం




కమిషనర్‌కు వినతి ఇస్తున్న పంచాయతీ రాజ్ కాంట్రాక్టు ఉద్యోగులు

రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం వైవిడి.ప్రసాద్ మంగళగిరిలో పంచాయతీరాజ్ కమిషనర్‌ను కలిసి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సమస్యను డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్తానని కమిషనర్ సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారు. డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎంపీ హరీష్ మాదుర్, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంఎల్ఎలు గిడ్డి సత్యనారాయణ, అయితాబత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు, దాట్ల సుబ్బరాజు, దేవ వరప్రసాద్‌లకు వినతిపత్రంతో పాటు రిప్రజెంటివ్ ఇచ్చారు. ట్యాంక్ వాచర్, ఎవెన్యూ వాచర్, గేట్ వాల్ ఆపరేటర్, ఎలక్ట్రీషియన్, వివిధ రకాల పేర్లతో దశాబ్దాల నుంచి జనరల్ ఫండ్ నుంచి జీతాలు తీసుకుంటూ సుమారు 12, 862 మంది విధులు నిర్వహిస్తున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు నల్లా సతీష్‌కుమార్, జి.సత్యనారాయణ, కోలా నాగప్రసాద్, దాసరి రాజు, గుత్తుల భైరవ స్వామి, ఎన్.జానకి రమణ, దాసరి రాజు, కుసుమే గిరీష్ కుమార్, ఎన్‌వి.రమణ, కుసుమే సురేంద్ర కుమార్, మోకా ప్రసాద్, చింతా రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్.గన్నవరం సర్పంచ్ ఈశ్వర్‌కు సత్కారం

ప్రజాశక్తి- అంబాజీపేట



సత్కరిస్తున్న టిడిపి సీనియర్ నాయకులు బుల్లియ్య

లంకల గన్నవరం సర్పంచ్ గనిశెట్టి ఈశ్వర్ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం టిడిపి సీనియర్ నాయకులు, ఎన్‌టిఆర్ యువసేన అధ్యక్షులు వక్కలంక బుల్లియ్య ఈశ్వర్‌కి పూలమాలలు వేసి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం జ్ఞాపికగా స్టీలు బిందె బహూకరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బుల్లియ్య మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధి కి ఈశ్వర్ ఎనలేని కృషి చేశారన్నారు. భవిష్యత్తులో ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు మరింత సేవలందించాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియాకు కో-ఆర్డినేటర్ వేమన గంగాధర్, బూత్ కన్వీనర్ మేడిశెట్టి కష్ణారావు తదితరులు పాల్గొని ఈశ్వర్ కి శుభాకాంక్షలు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - మామిడికుదురు



ప్రారంభిస్తున్న ఛైర్మన్ శ్రీనివాస్

నగరం సొసైటీ వద్ద మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ ఛైర్మన్ ఈలి శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేం ద్రాల ను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రసీదులు తీసుకుని ధాన్యం విక్రయించాలన్నారు అనంతరం సహకార వారో త్సవాల్లో భాగంగా సొసైటీ కార్యాలయము ఎదుట సహకార జెండాను ఆవిష్కరి ంచారు. కార్యక్రమంలో సొసైటీ పర్సన్లు, సిఇఒ అడబాల పెద్దిరాజు, రైతులు పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

సీవెజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు సేకరించిన స్థలాన్ని అమలాపురం ఆర్‌డిఒ కె.మాధవి మంగళవారం పరిశీలించారు. నగర పంచాయతీ పరిధిలో చింతలమెరక ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న సీవెజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్ స్థలం వివరాలను స్థానిక తహశీల్దార్ సుభాష్, నగర పంచాయతీ కమిషనర్ రవివర్మలను అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో డిటి బి.గోపాలకృష్ణ, సర్వేయర్ ప్రసాద్, గ్రామ రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కింది స్థాయి సిబ్బందిని పంపించేయడంపై నిరసన

ప్రజాశక్తి - కాట్రేనికోన

అధికారులు మండల సమావేశాలకు రాకుండా కింది స్థాయి సిబ్బందిని పంపించడం మండల సభ్యులను అవమానించడమేనని కాట్రేనికోన మండల పరిషత్ సభ్యులు నిరసన తెలిపారు. మంగళవారం మండల పరిషత్ అధ్యక్షులు కోలాటి సత్యవతి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మూడేళ్లుగా పలు శాఖల అధికారులు సమావేశాలకు గైర్హాజరవుతున్నా పై స్థాయి అధికారులు చర్యలు తీసుకోవడం లేదని వైస్ ఎంపిపి సానబోయిన నాగేశ్వరరావు, ఎంపిటిసి సంఘాని మునీంద్ర నిరసన తెలిపారు. సమావేశాలకు రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని తాను ప్రతిసారి జిల్లా అధికారులకు నివేదిక పంపిస్తున్నానని, చర్యలు తీసుకోవాల్సింది జిల్లా అధికారులేనని ఎంపిడిఒ వెంకటాచలం సమాధానం ఇచ్చారు. అనంతరం పలు అంశాలపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో ఉప్పూడి సర్పంచ్ రంబాల రమేష్, కాట్రేనికోన సొసైటీ పర్సన్ ఇంచార్జ్ పెసంగి రంగారావు వర్మ, కాట్రేనికోన, చెయ్యేరు ఎంపిటిసిలు మోకా చంద్ర నాగరత్నం, రాయుడు మహాలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెంకయ్య నాయుడును సత్కరించిన ఎంఎల్‌సి

ప్రజాశక్తి - అల్లవరం

వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన అమలాపురం పట్టణానికి చెందిన ఒంటెద్దు వెంకయ్యనాయుడు అల్లవరం మండలంలోని గోడి గ్రామంలో ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయెల్‌ను మంగళవారం వారి స్వగృహం నందు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం వెంకయ్య నాయుడుకు ఎంఎల్‌సి ఇజ్రాయెల్ పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ మాట్లాడుతూ రాబోయే సర్పంచ్, ఎంపిటిసి, మున్సిపల్ ఎన్నికలలో అందరూ సమిష్టిగా కృషిచేసి వైసిపి విజయానికి కృషి చేయాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రజా సమస్యలు పరిష్కారం లక్ష్యంగా ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామనిమంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఎఎంసి వైస్ ఛైర్మన్ దడాల నాగార్జున, కవల నానాజీ, అర్జీదారులు పాల్గొన్నారు.

బ్లాక్ బెల్ట్ సాధించిన నిహారికకు అభినందన

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణానికి చెందిన రత్నం కిక్ బాక్సింగ్ అండ్ కరాటే అకాడమీ విద్యార్థిని కారుమూరి నిహారిక కాకినాడ లో జరిగిన నేషనల్ కరాటే పోటీలో బ్లాక్‌బెల్ట్ సాధించింది. ఈ మేరకు మంగళవారం నిహారికను మంత్రి వాసంశెట్టి సుభాష్ ,సత్యం ఫౌండేషన్ అధినేత సత్యం, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రిశ్వంత రాయ్, కంచిమర్తి బాబురావు , పలువురు ప్రముఖులు అభినందించారు .

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రదర్శన

ప్రజాశక్తి - రామచంద్రపురం

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా కె.గంగవరం మండలంలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. పోలీసులు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థులు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రదర్శన నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కె.గంగవరం మెయిన్ రోడ్డు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, కె.గంగవరం పోలీసులు పాల్గొన్నారు.

స్వయం శక్తితో రాణించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

గ్రామీణ ప్రాంత యువత, రైతులు, మహిళలు మెరుగైన ఉపాధి అవకాశాలు పొంది, స్వయం శక్తితో రాణించాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఆదిత్య అన్నారు. మండల శ్రీ శక్తి భవనంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కొత్తపల్లి ధనలక్ష్మి అధ్యక్షతన ఎపిఎం సత్తిబాబు ఆధ్వర్యంలో ఎంఎస్‌ఎంఇపై మంగళవారం మండల స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎ.రాజు, వైద్యాధికారి డాక్టర్ డి.సాయి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న డిపిఒ శాంతకుమారి

రెడ్డిపల్లిలో పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

రెడ్డిపల్లి గ్రామంలో సర్పంచ్ కరాటం ప్రసన్న ప్రవీణ్ ఆధ్వర్యంలో జరుగుతున్న పారిశుధ్య పనులను జిల్లా పంచాయతీ రాజ్ అధికారి బి.శాంతకుమారి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుధ్య పనులను పరిశీలించిన ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి, పొడి చెత్త సేకరించి సహజ సంపద తయారీకి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గణపతి, ఆర్. జ్యోతి, కొలిశెట్టి జయప్రకాష్, కె.సూర్య భాస్కరరావు, దొరబాబు, సతీష్, శివ, అమిర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.

కపిలేశ్వరపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిదానేటి శివకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీలను గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలకు చెందిన విద్యార్థిని,విద్యార్థులు క్విజ్ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో డ్రాయింగ్ ఉపాధ్యాయులు అబ్బులు తదితరులు పాల్గొన్నారు **ఉప్పలగుప్తం:** స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి సలాది నాగేశ్వర రావు అధ్యక్షతన విద్యార్థులకు వివిధ అంశాలలో పోటీలు నిర్వహించారు. గొల్లవిల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్, క్రీడలు గ్రంథాలయాల పాత్ర వంటి వాటిపై అవగాహన కల్పించి పోటీలునిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఘనంగా గోపి పుట్టినరోజు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పట్టణ టిడిపి ఎస్ సి సెల్ అధ్యక్షుడు గొల్లపల్లి గోపి పుట్టినరోజు వేడుకలు నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షం లో మంగళ వారం ఘనంగా జరిగాయి. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక అన్న క్యాంటిన్ లో జరిగిన వేడుకల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి, రాష్ట్ర ఎస్ సి కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావుల సమక్షంలో అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను గోపి కట్ చేశారు. కార్యక్రమంలో దొమ్మేటి రమణ కుమార్, కట్టా సత్తిబాబు, అర్థాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళలకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - అల్లవరం

బోడసకుర్రు గ్రామంలో దళిత బహుజన రిసోర్స్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ అల్లాడి దేవ్‌కుమార్ ఆధ్వర్యంలో జెండర్ ఆధారిత హింసపై అవగాహనా సదస్సు సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో బత్తుల సునీత, మట్టా జయలక్ష్మి, విప్పర్తి నాగమణి, ముట్టబత్తుల భువనేశ్వరి, బొంతు నిర్మల జ్యోతి, అంబేద్కర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బొంతు హరికృష్ణ, రొక్కాల నాగేశ్వర రావు, మహిళలు పాల్గొన్నారు.

ఎన్నికల విధానంపై అవగాహన

ప్రజాశక్తి - ఆలమూరు

మూలస్థాన అగ్రహారం జెడ్‌పి ఉన్నత పాఠశాల నందు విద్యార్థులకు ప్రజాస్వామ్యంలో ఎన్నికల పై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు ఐ.అన్నపూర్ణాదేవి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థి నాయకుని ఎన్నికలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ లంక వరప్రసాదరావు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తూ పర్యవేక్షించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ కె.శేషమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సతీష్‌కుమార్ మృతిపై విచారణకు డిమాండ్

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

టిటిడి లో పరకామణి చోరీ కేసులో విజిలెన్స్ వింగ్ ఎవిఎస్ఒ సతీష్ కుమార్ మరణం పై ప్రభుత్వం విచారణ చేయించాలని కోనసీమ కుమ్మర శాలివాహన యూత్ డిమాండ్ చేశారు. మంగళవారం సఖినేటిపల్లిలో జరిగిన కార్యక్రమంలో వైసిపి యూత్ లీడర్ వెల్లా మిథున్ చక్రవర్తి, కుమ్మర శాలివాహన యూత్ లీడర్ పి.వెంకట రమణల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. .

పరిశుభ్రత, పచ్చదనాన్ని పెంపొందించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

అనునిత్యం గ్రామాల్లో పరిశుభ్రత, పచ్చదనాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ ఎ.రాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ రాజు ఆధ్వర్యంలో మంగళవారం సర్పంచులు, కార్యదర్శులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎఒ ఎంవి.మెహర్ ప్రకాష్, ఎపిఒ అరుణకుమారి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడు లక్ష్మణస్వామి మృతి

ప్రజాశక్తి - మండపేట



లక్ష్మణ స్వామి (ఫైల్)

మండలంలోని ఏడిద గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు, శతాధిక వృద్ధులు బండారు లక్ష్మణస్వామి మంగళవారం మృతి చెందారు. ఆయన భార్య, ఒక కుమారుడు చనిపోగా, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. లక్ష్మణస్వామి రెండేళ్ల క్రితం మార్కెట్ వద్ద పార్టీ స్థూపాన్ని కూడా నిర్మించారు. లక్ష్మణ స్వామి మృతికి సిపిఐ జిల్లా ఇన్ చార్జి దేగల ప్రభాకర్, సలాది కృష్ణ(వైజాగ్), రామచంద్రపురానికి చెందిన వైద్యులు స్టాలిన్, రామారావు (ఆర్థోపెడిక్), డాక్టర్ గొడవర్తి పట్టాభి రామయ్య (దుళ్ల), హోమియో వైద్యులు చల్లా రవికుమార్, శామ్యేలు, అనుకుల సుబ్బారావు తదితరులు సంతాపం తెలిపారు.